క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

మధిర: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా ఇన్‌స్పెక్టర్ ఆర్ గణేష్ బాబు అన్నారు. యోగా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం డోర్ టూ డోర్ యోగా ప్రచార కార్యక్రమం నిర్వహించి యోగా చేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. అలాగే ఈనెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగాడేలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ వెంకట్ లాల్, ఆయుష్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు కందుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విలువలు కలిగిన నాయకుడు మదన్‌లాల్


సంతాపం తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు

ఏన్కూరు: రాజకీయాల్లో విలువలు ఆత్మాభిమానం కలిగిన గొప్ప నాయకుడు వైరా మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బానోత్ మదన్‌లాల్ అని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బొంతు రాంబాబు అన్నారు. శనివారం స్థానిక ఠాగూర్ కల్యాణ మండపంలో బాదావత్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించిన మదన్‌లాల్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు ప్రసగించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు మందా సరస్వతి

వైరా: వైరా నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు మందా సరస్వతి అన్నారు. శనివారం వైరాలో వైరాటౌన్ అధ్యక్షుడు మనుబోలు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో జనరల్ సెక్రటరీ పల్లపాటి వెంకటేష్ యాదవ్ అధ్యక్షతన వైరా టౌన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సరస్వతి బీజేపీ జెండా ఆవిష్కరించి సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కార్తీక్, సాయి చౌదరి, రామారావు, వరదరాజు తదితరులున్నారు.

మహిళా ఎస్సైపై దాడి గర్హనీయం


మాట్లాడుతున్న రమేష్

సత్తుపల్లిరూరల్: మద్యం మత్తులో మహిళా ఎస్సై హరితపై కల్లూరులో దాడికి పాల్పడిన కాంగ్రెస్ గుండాలను కఠినంగా శిక్షించాలని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ రమేష్ అన్నారు. శనివారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడిని ఖండిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన బీజేపీ నాయకులను స్థానిక కాంగ్రెస్‌నాయకులు ఫోన్‌చేసి బెందిరించడం సరికాదన్నారు. సమావేశంలో కన్వీనర్ వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, మధుసూదన్‌రావు, సాలి శివకృష్ణ, బానోత్ విజయ్, నరేష్, మట్టా ప్రసాద్, నాని, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్


మధిర: ఈద్గాలో.. బోధిస్తున్న మత పెద్ద, పాల్గొన్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. గ్రామాల్లో ముస్లింలు ఉదయాన్నే ఈద్గాలు, మసీదులకు చేరుకుని నమాజ్ చేశారు. మతగురువులు పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం బంధువులకు, పేదలకు మాసం పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లి: బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రాగమయి


కారేపల్లి: భాగ్యనగరతండాలో స్వీటు తినిపిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్


ఏన్కూరు: తిమ్మారావుపేట మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు


బోనకల్: ముష్టికుంట్లలో..


సత్తుపల్లిటౌన్: ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు


ఎర్రుపాలెం: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


వైరారూరల్: ఖానాపురం ఈద్గాలో..


కల్లూరు: ఈద్గాలో..


తల్లాడ మసీదులో..


ముదిగొండ: అయ్యగారిపల్లిలోని ఈద్గాలో..


చింతకాని: లచ్చగూడెం గ్రామంలో..

మహాసభను జయప్రదం చేయండి

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో ఈ నెల 11న నిర్వహించనున్న సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు కోరారు. శనివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచిన పార్టీ సీపీఐ అన్నారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి పవన్, మండల కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు తదితరులున్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం


నృత్య శిక్షణలో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు, తల్లిదండ్రులు

వైరా: నృత్య కళాభారతి వైరా వారి ఆధ్వర్యంలో స్థానిక పాతసెంటర్ రామాలయంలో ఏప్రిల్ 25నుంచి నిర్వహించిన వేసవి నృత్య శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా చిన్నారులు గత 40 రోజులుగా నేర్చుకున్న హస్త సాముద్రికలు, జతులు, అంశములను ప్రదర్శించారు. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి కుంభ హారతి నృత్యం ఆకట్టుకుంది. శ్రీరామ భజన మండలి అధ్యక్షురాలు లోకా రమాదేవి, ఉపాధ్యక్షురాలు సీహెచ్ నిర్మల చిన్నారులకు బహుమతులు అందజేశారు. చిన్నారులకు ప్రాచీన భారతీయ సాంప్రదాయ నృత్యం నేర్పిస్తున్న నటరాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడి బస్సుకు ఫిట్‌నెస్ ఉందా..?

- ప్రారంభం కానున్న పాఠశాలలు
- తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు
- నిబంధనలపై రవాణాశాఖ అవగాహన


స్కూల్‌బస్సుకు ఫిట్‌నెస్ పరీక్షిస్తున్న రవాణాశాఖ అధికారులు


ప్రైవేట్ బస్సు యాజమాన్యాలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

సత్తుపల్లిటౌన్: మరోవారం రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇప్పటికే గల్లీగల్లీ తిరుగుతూ తమ పాఠశాలల్లో పిల్లలను చేర్పాలంటూ ప్రచారం చేస్తున్నాయి. దాదాపు అన్ని పాఠశాలలకు స్కూల్ బస్సుల్లోనే విద్యార్థుల రాకపోకలు సాగిస్తున్నారు. పిల్లలను ఉదయం, సాయంత్రం తీసుకెళ్లే బడి బస్సులను కూడా తల్లిదండ్రులు గమనించాలి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా పాఠశాల బస్సులు రోడ్డు ఎక్కకుండా రవాణాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు..

గత వారంరోజులుగా సత్తుపల్లి, వైరా రవాణాశాఖ కార్యాలయాల పరిధిలో విద్యా సంస్థల యాజమాన్యాలకు ఫిట్‌నెస్‌లేని బస్సుల వల్ల జరుగుతున్న ప్రమాదాలను వివరించారు. నిబంధనలపై అవగాహన కల్పించటం, బస్సులకు సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. సత్తుపల్లి రవాణాశాఖ పరిధిలో 117 స్కూల్ బస్సులు ఉండగా.. ఇప్పటి వరకు 105 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, వైరా పరిధిలో 120 స్కూల్ బస్సులకు గాను 58 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేశారు. బడి బస్సుల నిబంధనల అమలుపై రవాణాశాఖ యంత్రాంగం అప్రమత్తమై ప్రత్యేక దృష్టి సారించింది.

నిబంధనలు ఇలా..:

→ బడి బస్సుకు తప్పకుండా పసుపురంగు ఉండాలి. బస్సులపై విద్యార్థుల చిత్రాలు ఉండాలి.
→ బస్సులకు నలువైపులా ప్లాస్టిక్ అంబర్‌లైట్లు, అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స పెట్టె ఉండాలి.
→ డ్రైవర్ వద్ద ప్రయాణించే విద్యార్థుల సంఖ్య, అటెండర్ ఉండాలి.
→ బస్సుకు అత్యావసర ద్వారం, దానికి ఎమర్జెన్సీ స్టిక్కరింగ్, బస్సు టైర్లు, సీట్లు మంచి కండీషన్‌లో ఉండాలి.
→ క్లాస్ బ్రేకింగ్ హామర్ తప్పనిసరి. డ్రైవర్ వయస్సు 60 ఏళ్లకు మించరాదు. హెవీడ్రైవింగ్ లైసెన్స్, ఐదేళ్ల అనుభం ఉండాలి.
→ బస్సు మెట్లు చిన్నారులు సులువుగా ఎక్కి దిగేందుకు అనువుగా ఉండాలి.
→ బస్సు లోపల, బయట భాగంలో అద్దాలు అమర్చాలి. బస్సులోని సీట్ల మధ్య ఖాళీ ప్రదేశంలో విద్యార్థులు నడిచే వద్ద మ్యాట్ ఏర్పాటు చేయాలి.

ప్రమాణాలు పాటించాలి..



స్కూల్ బస్సులు తప్పనిసరిగా రవాణాశాఖ ప్రమాణాలు పాటించాలి. ఈ నెల 12వ తేదీలోగా బస్సు సామర్థ్య పరీక్షలు పూర్తి చేసుకోవాలి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పూర్తికాని బస్సుల యజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తాం. విస్తృతంగా తనిఖీలు చేపడతాం. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం.

– జి.ఎస్.శ్రీనివాస్, ఎంవీఐ, సత్తుపల్లి

ప్రైవేట్ టీచర్ల అడ్మిషన్ల తంటాలు

కొణిజర్ల: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులపై అడ్మిషన్ల కత్తి వేలాడుతున్నది. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ప్రతి ఉపాధ్యాయుడు పిల్లలను చేర్పిస్తేనే కొలువు లేకుంటే కష్టమేనని యాజమాన్యాలు చెబుతుండడంతో.. టీచర్లు పిల్లలకోసం అన్ని గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు. పాఠశాలల యాజమాన్యాలు టీచర్లను ఉదయాన్నే బస్సులో గ్రామాల్లో వదిలేసి వెళ్లగా.. వారు అడ్మిషన్లకోసం ఇంటింటికీ తిరుగుతూ పాట్లు పడుతున్నారు.

మండలంలో వివరాలిలా..

ఇప్పటికే కొణిజర్ల మండలంలో ఖమ్మం నుంచి దాదాపు పది కార్పొరేట్ స్కూల్ బస్సులు, వైరా నుంచి ఐదు ప్రైవేట్ పాఠశాలల బస్సులు, మండలంలో ఐదు పాఠశాలల బస్సులు తిరుగుతున్నాయి. వీటికి తోడు ఈ ఏడాది ఖమ్మంలో కొత్తగా ఏర్పాటు చేసిన రెండు కార్పొరేట్ స్కూల్ బస్సులు, వైరా నుంచి మరో ప్రైవేట్ పాఠశాల బస్సు తిప్పడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు విద్యార్థులు గురుకులాల బాట పడుతుండగా కేవలం ఆర్థికంగా స్థిరపడ్డ వారు మాత్రమే ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్నారు.

టార్గెట్ పూర్తిచేస్తేనే జీతం..

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యలు ఒక్కొక్క టీచర్‌కి 5నుంచి 15వరకు అడ్మిషన్లు చేయాల్సిందేనని నిబంధనలు విధిస్తున్నాయి. దీంతో టీచర్లు మార్కెటింగ్ ఏజెంట్ల అవతారం ఎత్తుతున్నారు. మరోవైపు ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట పేరిట గ్రామాల్లో తిరుగుతున్నారు. దీంతో అడ్మిషన్లు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి పాఠశాలలో వసూలు చేసిన ఫీజుల్లో 59శాతం టీచర్లకు జాతాలివ్వాలి. కానీ జీవోను తుంగలో తొక్కి యాజమాన్యాలు అరకొర జీతాలిచ్చి వారితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు.

ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతిపేదవాడికి ఇందిరమ్మ ఇల్లు వస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని భాగ్యనగర్‌తండా, పోలంపల్లి, అప్పాయిగూడెం, సూర్యతండా, రావోజీతండా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భాగ్యనగర్‌తండాలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. ప్రజలు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపించుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఎస్‌ఐ గోపి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


తల్లాడ: బిల్లుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్/తల్లాడ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, ఉచిత భోజనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించటం జరుగుతుందని ఎంఈఓలు నక్కా రాజేశ్వరరావు, ఎస్.దామోదరప్రసాద్ తెలిపారు. సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, తల్లాడలోని బిల్లుపాడులో ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కృష్ణారావు, సత్యనారాయణరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం వీర్ల సరోజిని, పద్మావతి, హరిలాల్, సుధాకర్‌రెడ్డి, శేషు, నర్సింహారావు, వెంకటేష్, లక్ష్మీకాంతమ్మ, కె.శ్రీనివాసరావు, సీఆర్‌పీ శివకృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో బాలికల పాఠశాల విద్యార్థుల ప్రతిభ


బాలికలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికకావడంతో శనివారం వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎన్.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థికి సన్మానం


వరుణ్‌తేజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మధిర: పట్టణానికి చెందిన కొత్తూరు జగన్, సంధ్యల కుమారుడు సాయి వరుణ్ తేజ్ జేఈఈ మెయిన్స్ ఆల్ ఇండియా 320 ర్యాంక్ సాధించాడు. దీంతో అభిరామ్ టవర్స్‌లో మధిర సేవా సమితి అధ్యక్షుడు పల్లపోతు ప్రసాదరావు.. ప్రముఖుల సమక్షంలో విద్యార్థిని శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేణుగోపాలరావు, కృష్ణ, రాజశేఖర్, రామనాథం, శ్రీనివాసరావు, కృష్ణారావు, సత్యనారాయణ, అప్పారావు పాల్గొన్నారు.

డీ సెట్‌లో ప్రతిభ చూపిన రమ్యదీప్తి


రమ్యదీప్తి

తల్లాడ: డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డీ సెట్)లో మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన విద్యార్థిని చాపల రమ్యదీప్తి తన ప్రతిభను చాటుకుంది. శనివారం విడుదలైన డీసెట్ ఫలితాల్లో రమ్యదీప్తి 76మార్కులతో రాష్ట్రస్థాయిలో 21వ ర్యాంక్ సాధించింది. దీంతో ఆమెను పలువురు అభినందించారు.

ముష్టికుంట్లకు చేరుకున్న సైకిల్‌యాత్ర


మాట్లాడుతున్న ఎస్సై వెంకన్న

బోనకల్: మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించేలా డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్‌యాత్ర శనివారం బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారికి ప్రజాసంఘాల నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై పొదిలి వెంకన్న, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. సైకిల్‌యాత్ర చేపడుతూ డ్రగ్స్‌పై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు తదితరులున్నారు.